నమస్తే తెలంగాణ
జోగుళాంబ గద్వాల
వనపర్తి
5 | మహబూబ్‌నగర్, సోమవారం 4 మార్చి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY



సమావేశంలో మాట్లాడుతున్నమా జీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# ఎండుతున్న నారుమడులు

- సాగునీరు లేక రైతుల కష్టాలు వర్ణణాతీతం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 3 : కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు ఇబ్బందులతో పంట పొలాలకు నీరులేక నారుమడులు ఎండిపోతున్నాయని, రైతులు నీటిని ట్యాంకర్లతో తెచ్చి పంటలు కాపాడుకొనే పరిస్థితి ఏర్పడిందని మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో హన్వాడ మండల బీఆర్‌ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైదని, ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల్లో ఎటువంటి సమస్యలు లేకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, ఇప్పుడున్న ప్రభుత్వంలో వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు కూడా రావడం లేదని, సమస్యలు తిష్ట వేశాయని, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామాల్లో తిరిగితే ప్రజలు నిలదీసే పరిస్థితులు వచ్చాయన్నారు. బీఆర్‌ఎస్ కోసం కష్టపడి పని చేసేవారికి మంచి భవిష్యత్ ఉంటుందని వారికి పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు, తప్పుడు కేసులు పెట్టినా ఎవరూ భయపడవద్దని న్యాయపరంగా ముందుకు పోదామన్నారు. రానున్న పార్లమెంట్, సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలిచే అవకాశాలు ఉన్నాయని, అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హన్వాడ ఎంపీపీ బాలరాజు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, నాయకులు లక్ష్మయ్య, రమణారెడ్డి, బాలయ్య, కృష్ణయ్యగౌడ్, నరేందర్, శేఖర్, చెన్నయ్య, వెంకటయ్య, జంబులయ్య తదితరులు పాల్గొన్నారు.



వంగూరులో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

# ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వం

- కేసీఆర్ ప్రభుత్వ ఉద్యోగాలను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం
- వ్యక్తిగత ఆరోపణలతో కాలం గడుపుతున్న సీఎం రేవంత్
- పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటెయ్యాలి : గువ్వల బాలరాజు

వంగూరు, మార్చి 3 : ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం చేతగాక ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నదని బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కేసీఆర్ కుటుంబంపై చేసిన ఆరోపణలతో పాటు ప్రభుత్వం ఏర్పడిన అనంతరం అదే ఆరోపణలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. డిసెంబర్ 9న రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి మాట తప్పారని, అదేవిధంగా ఆరు గ్యారెంటీలను కూడా అమలు చేయడంలో నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం వేసిన 25 వేల ఉద్యోగాల నోటిఫికేషన్లకు సంబంధించిన నియామక పత్రాలు అందించిన సీఎం రేవంత్ వాటిని తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించకుండా రైతులు, ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. రూ.30 వేల కోట్లతో ప్రజలకు ఇంటింటికీ తాగునీరు అందించే మిషన్ భగీరథ వంటి బృహత్తర పథకంలో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులతోపాటు గ్రామాల్లో పనిచేస్తున్న వీవోఏలు, ఆశ కార్యకర్తలను తొలగించి తమ పార్టీ కార్యకర్తలను నియమించుకోవాలనే నీచ సంస్కృతికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏనాడూ చిరుద్యోగులను తొలగించే ప్రయత్నం చేయలేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేక కేసీఆర్ కుటుంబంపై నిత్యం ఆరోపణలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో కక్ష సాధింపులు తీవ్రమయ్యాయని, వాటికి స్వస్తి పలకకపోతే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు గణేశ్‌రావు, కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సురేందర్, నాయకులు పుల్లయ్యాయాదవ్, ఎల్లాగౌడ్, బాలస్వామిగౌడ్, నాగేశ్, రవియాదవ్ ఉన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

# ప్రజల నుంచే కవిత్వం రావాలి

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న
- అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి మహాసభల పండుగ

నాగర్‌కర్నూల్, మార్చి 3: ప్రజల నుంచే కవిత్వం బయటకు రావాలని, ఆ దిశగా ఏర్పడి అభ్యుదయ రచయితల సంఘమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సింగిల్‌విండో సమావేశ మందిరంలో ఉమ్మడి అభ్యుదయ రచయితల సంఘం జిల్లా మహాసభలను జిల్లా అధ్యక్షుడు కల్వకోలు మద్దిలేటి అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలకు గోరటి వెంకన్న ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సమసమాజ మార్పుకోసం వ్యవస్థలో సమానత్వం కోసం ఏర్పడిన సంఘమే అభ్యుదయ రచయితల సంఘమన్నారు. స్వాతంత్ర్యం కన్నా ముందే ప్రగతిశీల భావాలతో ఏర్పడ్డ సమాజంలో అభ్యుదయ కవులు ఎంతో మంది పనిచేశారన్నారు. శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, బొల్లి ముంత సాంబశివరావు, రాచమల్లు, తాపీ ధర్మారావు, వట్టికోట ఆళ్వారుస్వామి, దాశరథి కృష్ణమాచార్య వంటి ఎందరో మహాకవులు అభ్యుదయ సంఘాన్ని నడిపారన్నారు. వీరికన్నా ముందు గౌతమ బుద్ధుడు, మహాత్మాజ్యోతిరావుపూలే, వీరబ్రహ్మం, వేమన, కబీరు, నారాయణగురు, బాబాసాహెబ్ అంబేద్కర్ ఎందరో మహనీయులు పోరాడిన మార్గమే అభ్యుదయ మార్గమని, అరసం సంఘం పుట్టుటకు ఇదే కారణమని చెప్పారు. జాతీయ నాయకులు వేల్పుల నారాయణ మాట్లాడుతూ 1936 ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో ప్రోగ్రెసివ్ రైటర్స్ ఏర్పడిందని, 1943లో తెనాలిలో మొదటి మహాసభ జరిగిందని, నాటి నుంచి నేటి వరకు తాడిత పీడిత ప్రజల పక్షాన పోరాడుతున్న ఏకైక సంఘం అరసం అన్నారు. అదేవిధంగా రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు రామస్వామి, రాష్ట్ర కార్యదర్శి రాపోలు సుదర్శన్, పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు రాఘవాచారి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏలేశ్వరం వెంకటేశ్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమానికి ముందు జెండావిష్కరణ చేపట్టారు. అనంతరం అరసం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మల్లికార్జున్, సాయిశంకర్, సీపీఐ రాష్ట్ర నాయకులు ఆనంద్, సీనియర్ జర్నలిస్టు కందికొండ మోహన్, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, లక్ష్మణ్‌గౌడ్, కవులు వనపట్ల సుబ్బయ్య, వహీద్‌ఖాన్, కాశన్న, శ్యామల, పద్మావతి, విజయ, హరిణి, లక్ష్మీనర్సింహ, ప్రతాప్‌కౌటిళ్య, గుడిపల్లి నర్సింహారెడ్డి, ఎస్టీయూ అధ్యక్షుడు సంగం మురళి, రాములు, ముచ్చర్ల దినకర్, నూనె క్రాంతి, కళాకారులు కురుమూర్తి, గోపాల్, పర్వతాలు, సంతోష్, సురేశ్, మధు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



పారిశుధ్యప నులుచేప డుతున్నసిబ్బంది

# వేతన వెతలు!

- నాలుగునె లలుగా జీతాల్లేవు..
- నలుగుతున్న పారిశుధ్యకా ర్మికులు
- ఎస్టీవోలో చెక్కులు పెండింగ్
- డిజిటల్ కీ నిలిపివేతతో కష్టాలు
- కొన్ని చోట్ల 4 నెలలు, మరికొన్ని చోట్ల రెండు నెలలు పెండింగ్
- పుట్టెడు కష్టాల్లో సఫాయిలు

వనపర్తి, మార్చి 3 (నమస్తే తెలంగాణ) : పారిశుధ్య కార్మికుల కష్టాలు వర్ణణాతీతం. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న లేబర్‌కు జీతాలు రాక అష్టకష్టాలు పడుతున్నారు. ఒకటికాదు.. రెండు కాదు.. ఏకంగా నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదు. దీంతో కుటుంబ పోషణ కోసం దొరికిన పైసలు తెచ్చుకుంటుండడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. శానిటేషన్ విభాగంలో పూట గడవలేని వారే పనిచేస్తుంటారు. అలాంటి వారికి అనేక కారణాలతో నెలల తరబడి వారికిచ్చే చిన్న జీతాలను నిలిపి వేస్తే ఎలా గడుస్తుందో తెలుసుకుంటే మనసు తరుక్కుపోతుంది. జిల్లాలో కొన్ని చోట్ల నాలుగు నెలల జీతాలు రావాల్సి ఉన్నది. మరికొన్ని చోట్ల రెండు నెలలు అందాల్సి ఉన్నది. వనపర్తి జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల్లో 1,058 మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ మల్టీపర్పస్ వర్కర్స్‌కు నెలకు రూ.9,500 వేతనాన్ని ప్రభుత్వం చెల్లిస్తుంది. ముందుగా రూ.8,500 ఉండగా.. గత కేసీఆర్ ప్రభుత్వం జీతాలను కొంత పెంచింది. నాటి సర్కారు పెండింగ్ లేకుండా అందించింది. ఎప్పుడో ఒకసారి ఒకటి.. అర జీతాలు వచ్చినా ఇన్ని నెలలు పెండింగ్ పడలేదని కార్మికులు అంటున్నారు. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వేతనాలు చెల్లించే విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నది.

***ప్రతి జీపీలో నెలలుగా పెండింగ్..***

జిల్లాలోని 255 గ్రామపంచాయతీలకుగానూ అన్ని గ్రామ పంచాయతీల్లో దాదాపు రెండు నెలల జీతాలు పారిశుధ్య కార్మికులకు అందాల్సి ఉన్నది. జనవరి, ఫిబ్రవరి వేతనాలు రావాలి. ఫిబ్రవరి ఒకటో తేదీతో సర్పంచుల పదవీకాలం ముగియడంతో జనవరిలోనే జీపీ అకౌంట్లన్నీ లాక్ అయ్యాయి. కొన్ని చిన్న గ్రామ పంచాయతీల్లో డబ్బులు లేక కార్మికులకు వేతనాలు ఇవ్వలేదు. అప్పటికే ఉన్న డబ్బులన్నీ చేసిన పనులకు ఖర్చు కావడం.. ఇంకా కొన్ని పనులకు సరిపోకపోవడం వంటి పరిస్థితులు అనేక గ్రామ పంచాయతీల్లో నెలకొన్నాయి. చివరి దశ పదవీ కాలంలో ఉన్న సర్పంచులు కొందరు ఉన్న డబ్బులను తీసుకునే ప్రయత్నం చేయడంతో జీపీల అకౌంట్లన్నీ ఖాళీ అయ్యాయి. ఇలా అన్ని సమస్యలు నేడు గ్రామాల్లో పనిచేస్తున్న కార్మికుల మెడకు చుట్టుకోవడంతో వేతనాలందలేదు. చిన్న జీపీ ల్లో ట్రాక్టర్ కంతులు, కరెంట్ బిల్లులకు చెల్లింపులు చే యడంతో కార్మికుల వేతనాలకు బ్రేక్ పడుతూ వచ్చింది.

***పెండింగ్‌తో పస్తులే..***

వనపర్తి జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో నాలుగు నెలలుగా జీతాలు నిలిచిపోవడంతో పస్తులే అని కార్మికులు వాపోతున్నారు. పైసలుండి చెక్కులు జనరేట్ అయినప్పటికీ ఎస్టీవో కార్యాలయాల్లో పెండింగ్‌లో పడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి గ్రామ పంచాయతీల చెక్కులు ఒకటి కూడా ఎస్టీవోల ద్వారా అమలు కాలేదని కార్మికులు, తాజీ మాజీ సర్పంచులు ఆవేదన చెందుతున్నారు. ఇక చిన్న గ్రామ పంచాయతీల్లో డబ్బుల కొరత కనిపిస్తున్నప్పటికీ కార్మికులు మాత్రం ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నాలుగు నెలల జీతాలు రాకుంటే ఎలా పని చేయాలని కార్మికులు నిలదీస్తున్నారు. రూ.లక్షలాది జీతాలు తీసుకునే అధికారులు వారం రోజులు వేతనాలు రాకుంటేనే గోల చేస్తారని, మాలాంటి నిరుపేదలకు ఇన్ని నెలలుగా రాకుంటే ఏం తినాలని వాపోతున్నారు.

***డిజిటల్ కీకి బ్రేక్..***

ప్రతి గ్రామ పంచాయతీకి ఎస్ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధుల అకౌంట్లు వేర్వేరుగా ఉంటాయి. వీటికి అదనంగా గ్రామ పంచాయతీ అకౌంట్ ప్రత్యేకంగా ఉంటుంది. అయితే కార్మికుల వేతనాలు మాత్రం ఎక్కువగా ఎస్ఎఫ్‌సీ అకౌంట్ ద్వారానే చెల్లింపులు జరుగుతాయి. ఇక 15వ ఆర్థిక సంఘం నిధుల లావాదేవీలన్నీ డిజిటల్ అకౌంట్ ద్వారానే జరుగుతాయి. ఇందుకు సంబంధించిన నిర్వహణ జిల్లా కేంద్రం నుంచి ఉంటుంది. ఎన్నికలకు ముందు నుంచి ఎస్ఎఫ్‌సీ నిధుల లావాదేవీలు ట్రెజరీ కార్యాలయాల్లో పూర్తిగా నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు నెలలు గడిచినా గ్రామ పంచాయతీ కార్మికుల చెక్కులకు మాత్రం మోక్షం రావడం లేదు.

15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి డిజిటల్ కీ లాక్‌ను క్రమం చేస్తే కనీసం కార్మికుల జీతాల సమస్యనైనా తొలగిపోయే అవకాశం ఉన్నది.

## నాలుగు నెలలుగా జీతాలు అందని గ్రామాలు

పారిశుధ్య కార్మికులకు కొన్ని జీపీల్లో నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో మూడు నుంచి నాలుగు నెలలుగా కార్మికులకు జీతాలు అందని గ్రామాల వారీగా చూస్తే.. మదనాపురం మండలంలో 8 గ్రామ పంచాయతీలు, కొత్తకోట మండలంలో 5 జీపీలు, వీపనగండ్లలో 4 జీపీలు, అమరచింతలో 2 జీపీలు, వనపర్తిలో 2, పాన్‌గల్‌లో 2, గోపాల్‌పేటలో 2, పెద్దమందడిలో ఒక గ్రామపంచాయతీలో నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో కార్మికుల కష్టాలు చెప్పనలవికావు.

### పస్తులుండాల్సి వస్తున్నది..



మాకు నాలుగు నెలల నుంచి జీతాలు రావడం లేదు. అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు జీతాలు రాలేదు. చిన్న కుటుంబాల నుంచి వచ్చిన మేం జీతాలు ఇవ్వకుంటే పనులు ఎలా చేసేది. మాకు ఇచ్చే జీతం చాలా తక్కువ. నెలకు సక్రమంగా వస్తేనే కుటుంబం గడుపడం కష్టం. ఇలా నెలల తరబడి పెండింగ్ పెడితే పస్తులుంచాల్సి వస్తుంది. జీతం వస్తుందని ఏదైనా కార్యం పెట్టుకుంటే అంతే సంగతులు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా జీతాలు ఇచ్చి ఆదుకోండి.

*- సుంకులమ్మ, జీపీ కార్మికురాలు, వీపనగండ్ల గ్రామం, వనపర్తి జిల్లా*

### మా మొర ఆలకించండి..



మాకు 4 నెలలుగా జీతాలు రావడం లేదు. ఎప్పుడు అడిగినా వస్తుంది.. ఇస్తాం అంటారు.. కానీ అందించడం లేదు. ఒక్క నెల రాకుంటే ఎలాగో గడుపుతాం. కానీ నాలుగైదు నెలలుగా అందకుంటే ఫ్యామిలీని ఎలా నడపాలి. మావి పూట గడవని బ తుకులు.. రేవంత్ సర్కారు అర్థం చేసుకోవాలి. మా మొరను ఆలకించాలి. అధికారులు చెక్కు పంపించాం.. ఎస్టీవోలో ఆగిపోయిందని చెబుతున్నారు. మా బాధ ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదు. పండుగలు, ఇంట్లో పరిస్థితులు, అనారోగ్య సమస్యలు తలెత్తినా మళ్లీ అప్పు చేయాల్సి వస్తుంది. అధికారులు వెంటనే మా జీతాలు ఇవ్వాలి.

*- ఉమాశంకర్, మదనాపురం గ్రామం, వనపర్తి జిల్లా*

### రెండు, మూడ్రోజుల్లో పరిష్కరిస్తాం..



డిజిటల్‌కీ సంబంధించి రెండురోజుల్లో సమస్య పరిష్కారం అవుతుంది. ఇటీవలే జిల్లా స్థాయిలో అధికారుల బదిలీలు జరుగుతుండడం.. కొత్త అధికారులు రావడంతో కొంత సమయం తీసుకుంటుంది. జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు జీతాల సమస్య లేకుండా చూస్తాం. కొన్ని జీపీలు ఎస్టీవోలో వేసిన చెక్కులు పెండింగ్‌లో ఉండటంతో రెండు, మూడు నెలల జీతాలు పెండింగ్‌లో పడ్డాయి. డిజిటల్ కీని క్రమబద్ధీకరించి జీతాల సమస్య లేకుండా చూస్తాం.

*- రఘునాథ్‌రెడ్డి, డీఎల్‌పీవో, వనపర్తి జిల్లా*



రెండు రోజుల కిందట రాజాపూర్ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

# కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయం

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- తిక్కవీరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

అయిజ, మార్చి 3 : పట్టణంలోని తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఓపెన్ కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసం కలిగిస్తాయన్నారు. క్రీడాకారులు సమయస్ఫూర్తితో మెలుగుతూ ఆటల్లో గెలుపొందాలన్నారు. ఓటమి గెలుపునకు నాంది అని, క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పోటీలు పెద్ద ఎత్తున నిర్వహించడం సంతోషకరమన్నారు. క్రీడలకు తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 34జట్లు తరలిరావడం అభినందనీయమన్నారు. అంతకుముందు తిక్కవీరేశ్వరస్వామి కి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను శేషవస్త్రంతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



కబడ్డీ క్రీడాకారులతో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

# రామస్వామి ఆలయానిది ఘన చరిత్ర



సీతాదేవిఆ నవాళ్లను గుర్తించివివ రిస్తున్నశి వనాగిరెడ్డి

- అతిపురాతనమైన శిల్పకళా సంపదను కాపాడుకోవాలి
- పురావస్తు పరిశోధకుడు, ప్లీచే ఇండియా సంస్థ సీఈవో డాక్టర్ శివనాగిరెడ్డి
- శ్రీరాముడు, లక్ష్మణుడు, సీతమ్మ గృహాల గుర్తింపు

మూసాపేట, మార్చి 3 : దేశంలోనే అతిపురాతన కళా సంపద ఉన్న ఆలయాల్లో మూసాపేట రామలింగేశ్వరస్వామి ఆలయం ఒకటి. శ్రీరాముడు సీతా సమేతంగా లక్ష్మణుడితో నివాసం ఉన్న ఘన చరిత్ర ఆలయానికి ఉందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచే ఇండియా సంస్థ సీఈవో డాక్టర్ శివనాగిరెడ్డి తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు ఆయన ఆదివారం మూసాపేటలోని రామస్వామి గుట్టపై ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కొండపై ఉన్న ఆలయం వద్ద ప్రత్యేకంగా శ్రీరాముడు, సీతమ్మ, లక్ష్మణుల గృహాలు ఉన్నట్లు, స్వామి వారు ఆ కొండపైకి వచ్చి కొంతకాలం ఉన్న ఆనవాళ్లు ఉన్నాయని గుర్తించారు. ఇక్కడ స్వయంగా శ్రీరాముడే శివలింగం ప్రతిష్ఠించినట్లు తెలిపారు. రాతిబండలపై శ్రీరాముడు చెక్కిన శిల్పకళలు ఉన్నట్లు గుర్తించారు. శివాలయంతోపాటు వీరభద్ర ఆలయం, సరస్వతీ ఆలయం, ఆంజనేయస్వామి ఆలయంతోపాటు రాతి బండలపై చెక్కిన అతీ పురాతనమైన కిరీటంలేని వినాయకుడు, చెన్నకేశవస్వామి విగ్రహం, శిలాయుగం నాటి ఎద్దు బొమ్మలు, శిలాతోరణం, క్రీస్తుపూర్వం 1076 నాటి కన్నడ శాసనం, ఆలయంలో రాతియు గం, మధ్యయుగం, కాకతీయులు, చోళులు నాటి శిల్ప కళలు ఉన్నట్లు చెప్పారు. 4వ శతాబ్దం నుంచి 17వ శతాబ్దం వరకు ఆలయంలో వివిధ కట్టడాలు, శిల్ప కళలు ఉన్నాయి చెప్పారు. కానీ ఆలయం శిథిలమైపోయిందని చెప్పారు. అయితే ఆలయ పునఃనిర్మాణం చేయాలని కమిటీ సభ్యులు, మండల కేంద్రంతోపాటు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు నిర్ణయించిన అతి తక్కువ కాలంలోనే చాలా మంది ఆలయ అభివృద్ధికి స్వచ్ఛందంగా ముందుకు వస్తుండడం సంతోషకరమైన విషయమన్నారు. ఆలయ పునఃనిర్మాణానికి అవసరమైన ప్లాన్‌ను తాను తయారు చేసి ఇస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అస్కని నరేందర్‌తోపాటు గ్రామపెద్దలు, వేముల, తుంకినీపూర్, నిజాలాపూర్, సంకలమద్ది తదితర గ్రామాలకు చెందిన యువకులు ఉన్నారు.

# హంస వాహనంపై శ్రీశైలేశుడు

శ్రీశైలం, మార్చి 3 : శ్రీశైలంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భ్రమరాంబ, మల్లికార్జునస్వామివార్లు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవం అనంతరం కాళరాత్రిపూజ మంత్రపుష్పంతోపాటు స్వామి, అమ్మవార్లకు ఆస్థాన సేవ జరిగింది. వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరాగా స్వామి, అమ్మవార్లకు పూజలు శాస్త్రోక్తంగా జరిపించినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. గ్రామోత్సవంలో చైర్మన్ చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులతోపాటు, ఈఈలు రామకృష్ణ, మురళీధర్‌రెడ్డి, పౌర సంబంధాల అధికారి శ్రీనివాసరావు, ఏఈవోలు, శ్రీశైల ప్రభ సంపాదకులు, అధికారులు పాల్గొన్నారు.



హంసవాహనంపై స్వామి,అమ్మవార్లను ఊరేగిస్తున్న ఆలయ అధికారులు

# తక్కువ వడ్డీకే లోన్..!

- ఫేక్‌కాల్‌తో రూ.1.86లక్షలు మాయం

నాగర్‌కర్నూల్, మార్చి 3 : మండలంలోని మంతటి గ్రామంలో నాగయ్య అనే వ్యక్తి సైబర్ నేరస్తుడి చేతిలో మోసపోయాడు. బ్యాంకు నుంచి ఫోన్ చేసినట్లు ఓ వ్యక్తి ఫోన్‌కాల్ చేసి తక్కువ వడ్డీకి లోన్ అవకాశం ఉందని నమ్మబలికాడు. రూ.20 లక్షల రుణాన్ని 40పైసల వడ్డీకి ఇప్పిస్తానని చెప్పడంతో నాగయ్య సరేనన్నాడు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లిస్తే వెంటనే మీ అకౌంట్‌లోకి డబ్బులు వస్తాయని చెప్పడంతో అతను చెప్పినట్లుగా ప్రాసెసింగ్ ఫీజు, ఇతర ఫీజుల కింద మొత్తం రూ.లక్షా 86వేలు తన అకౌంట్ నుంచి అవతలి వ్యక్తి అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడు. నగదు వేసిన అనంతరం సదరు వ్యక్తికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోనట్లు తెలుసుకొని వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.